దరఖాస్తుల ఆహ్వానం

మన్సూరాబాద్, మే 14: ఎల్బీనగర్, మన్సూరాబాద్ డివిజన్ సూర్యోదయనగర్ కాలనీలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల (బాలానగర్ గర్ల్స్-1 బ్రాంచ్)లో వచ్చే విద్యా సంవత్సరం 2024-25 గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వినీల తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మైనార్టీ-51, క్రిస్టియన్-5, జైన్, పార్సి, బౌద్ధులు, సిక్కులు-4 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ విభాగాల్లో అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం నం బర్లు 9160255040, 91543 65 042లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. మెయిల్ ఐడీ tmrjcbalanagargirls1@gmail లోను వివరాలను పరిశీలించుకోవచ్చునని కోరారు.

రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత

కాచిగూడ, మే 14 :కార్పొరేట్ స్థాయిలో ఉండి ఏ -1 రైల్వేస్టేషన్ గుర్తింపు పొందినా.. తొలి కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరతతో కేసుల పరిష్కారం జాప్యం అవుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం రైల్వేస్టేషన్ నుంచి 60-80 వేల మంది తమ తమ గమ్యస్థానాలకు వెళ్తుంటా రు.ఎస్సైలు బదిలైమూడేండ్లు కావస్తున్నా ఇప్పటికీ అధికారులు నిమమించకపోవడం గమనార్హం. ఇక్కడ ముగ్గురు ఎస్సైలు, 13 మంది హెడ్‌కానిస్టేబుల్ ఉండాల్సి ఉండగా, 8 మంది హోం గార్డులు ఉండాల్సిన చోట ఒక్కరూ లేరు. ఉన్నతాధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు..

బర్కత్‌పుర విద్యార్థికి మాస్టర్ పట్టా

కాచిగూడ: బర్కత్‌పురకు చెందిన సెంట్రల్ పీస్ కమిటీ సభ్యుడు, ఈస్ట్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్‌శ్యామ్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు సాయినీరజ్ అమెరికాలోని క్లీవ్‌లాండ్ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి పట్టా అందుకున్నాడు.

సగర కులస్తుల సమస్యలు పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 14: సగర కులస్తుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి అభివృద్ధికి తన సహకారం అందిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్ లోని మహవీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కులో మంగళవారం నిర్వహించిన సగరుల కులదైవం శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూల మాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ సగరులు ఉద్యోగ, విద్యారంగంలో మరింతగా ఎదిగి భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులుగా నిలువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ సాగర్, లక్ష్మీనారాయణ, శ్రీను, రాఘవ, నాగరాజు, చిన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించిన నేతలకు కృతజ్ఞతలు

బడంగ్‌పేట, మే14: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలలో సహకరించిన బీఆర్ఎస్ నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రచారం తనకు తోడుగా వెన్నంటి ఉన్న వారందరికీ ఎప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. తన గెలుపు కోసం కష్ట పడి పనిచేసి ఓట్లు వేయించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్ అధినేత, కేసీఆర్‌కు, మాజీ మంత్రి కేటీఆర్‌కు, మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

తగ్గిన ఓటింగ్ శాతం

ఎల్బీనగర్ , మే 14: మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానంలోని ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 46.27 శాతంతో 2,79,795 ఓట్లు పోలయ్యాయి. ఉదయం పోలింగ్ కోసం పెద్దగా ఆసక్తిని ప్రదర్శించని ఓటర్లు సాయంత్రం సమయాల్లో పోలింగ్ కేంద్రాలకు రావడంతో చివరికి పోలింగ్ 46.27 శాతం ఓటింగ్ జరిగింది. గతేడాది పార్లమెంటు ఎన్నికలతో పోల్చితే ఈ ఏడాది ఓటింగ్ శాతం తగ్గింది. ఉదయం 9 గంటల వరకు చాలా పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక అధికారులు, పోలింగ్ సిబ్బంది పనిలేక ఖాళీగా దర్శనం ఇచ్చారు. ఉదయం 9 గంటల సమయానికి ఎల్బీనగర్ నియోజకవర్గంలో కేవలం 5.9 శాతం మాత్రమే ఓట్లు పోల్ కాగా ఉదయం 11 గంటలకు 12.36 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 26.74 శాతం, సాయంత్రం 3 గంటల వరకు 34.82 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 43.76 శాతం, చివరిగా సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 46.27 శాతం పోలింగ్ జరిగింది. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 6,04,763 మంది ఓటర్లు ఉండగా 2,79,795 ఓట్లు పోలయ్యాయి. వీరిలో పురుష ఓటర్లు 3,14,101 ఉండగా 1,45,787 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనగా, మహిళా ఓటర్లు 2,90,528 మంది ఓటర్లకు గాను 1,33,977 మంది ఓట్లు వేయగా ఇతర ఓటర్లు 134 మంది ఉండగా 31 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎవరి ధీమా వారిదే..

మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలోని ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పార్లమెంటు ఎన్నికల అనంతరం ఈవీఎంలను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని డీఆర్‌సీ కేంద్రంలో బందోబస్తు మధ్య ఉంచారు. ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తం కాగా రాజకీయ పార్టీల నాయకులు మాత్రం ఎవరికి వారు తమకంటే తమకే ఎల్బీనగర్‌లో మెజార్టీ వస్తుందని ఆశిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఎవరికి వారు తమకు అనుకూలంగా పోలింగ్ జరిగిందని భావిస్తున్నారు. ఓటరు తీర్పు ఎలా వచ్చిందనన్నది, ఎవరికి మెజార్టీ వస్తుందన్నది మాత్రం జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

అభినందనలు

దుర్గారెడ్డిని సన్మానిస్తున్న టీపీసీసీ సేవాదళ్ చైర్మన్ జితేందర్

చంపాపేట, మే14: ఇటీవల చంపాపేట డివిజన్ మల్‌రెడ్డి రంగారెడ్డి కాలనీకి చెందిన నారాయణ్ దుర్గారెడ్డి టీపీసీసీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్‌గా నియామకమైన సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ చైర్మన్ మిద్దెల జితేందర్ తన కార్యాలయంలో దుర్గారెడ్డికి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బద్రీనాథ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సీనియర్ నాయకులు సురేందర్, కిరణ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న సొసైటీ సభ్యులు, వృద్ధులు

మన్సూరాబాద్, మే 14: నాగోల్ డివిజన్ పరిధి కోఆపరేటివ్ బ్యాంకు కాలనీలోని కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం మొబైల్ మెడికేర్ యూనిట్ (ఎంఎంయూ) ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో బీపీ, షుగర్, జనరల్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సుమారు 100 మంది వృద్ధులు ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ డాక్టర్ పాండుగౌడ్, కోశాధికారి చల్లా రాఘవరెడ్డి, సభ్యులు మురళీధర్, ఏవీ దినేష్, కోఆపరేటివ్ బ్యాంకు కాలనీ అధ్యక్షుడు శరత్‌రెడ్డి, కాలనీవాసులు నర్సింహారెడ్డి, కోటిరెడ్డి, సత్యనారాయణ, భీమయ్య, పెరుమాళ్ల తదితరులు పాల్గొన్నారు.

బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

బడంగ్‌పేట, మే14: పార్లమెంట్ ఎన్నికల్లో ఇన్ని రోజులు ఎన్నికల ప్రచారంలో వివిధ పార్టీల నేతలు బిజీ బిజీగా గడిపారు. పార్లమెంట్ ఎన్నికలలో ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఎత్తుకు పై ఎత్తులు వేశారు. ఓటర్లను తమ వైపు మలుపు కోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేశారు. ఇంటింటి ప్రచారాలు, రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు పెట్టి బలనిరూపన ప్రదర్శనలు చేశారు. ఓటర్ మనస్సు గెలుచుకోవడానికి చేయవలసిన ప్రయత్నాలు అన్ని చేశారు. ఓటర్లు మాత్రం సైలెంట్‌గా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహేశ్వరం నియోజక వర్గం లో ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఫలితాలు ఇంకా 20 రోజులు ఉండటంతో ఇక నేతల చూపంతా ఫలితాల వైపు మళ్లింది. ఎన్నికల సమరం ముగియడంతో కాలక్షేపం కోసం ఇతర ప్రాంతాలకు పోనున్నట్లు వారి అనుచరగణం చెబుతున్నారు. ఫలితాలు వచ్చేదాక అభ్యర్థుల గుండె లబ్ డబ్ అంటూనే ఉంటుంది. అందరి చూపు పార్లమెంట్ ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూపులు మొదలయ్యాయి.

కౌంటింగ్ వరకు అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, మే 14 : ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని టీ పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ అన్నారు. మంగళవారం వనస్థలిపురంలో పార్టీ కార్యాలయంలో 11 డివిజన్‌ల అధ్యక్షులు, ఇన్‌చార్జిలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు ఎంతో శ్రమించి పనిచేశారని అభినందించారు. ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ విధానంపై ఏజెంట్లకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడ అనుమానం వచ్చిన వెంటనే చీఫ్ ఏజెంట్‌ను సంప్రదించాలన్నారు. ఓటింగ్ శాతంలో తేడా లుంటే గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వజీర్ ప్రకాశ్‌గౌడ్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కార్పొరేటర్ సుజాత నాయక్, మకుటం సదాశివుడు, వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవి, బుడ్డ సత్యనారాయణ, కిశోర్ గౌడ్, కుట్ల నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంటలు అంటుకొని వృద్ధురాలు మృతి

మలక్‌పేట, మే 14: ప్రమాదవశాత్తు వంటగదిలో మంటలు అంటుకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీపురం కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భాస్కర్‌రావు అనే రిటైర్డ్ ఉద్యోగి భార్య రాజేశ్వరి(72)తో కలిసి శ్రీపురం కాలనీలో సొంతింట్లో నివాసముంటున్నాడు. కాగా మంగళవారం ఉదయం 11.30 గంటలకు విద్యుత్ బిల్లు చెల్లించేందుకు మీ సేవకు వెళ్లగా ఇంట్లో అద్దెకు ఉంటున్న జుగల్ కిశోర్ ఫోన్‌చేసి వంటగదిలో మంటలు అంటుకొని రాజేశ్వరి తీవ్రంగా గాయపడిందని తెలిపారు. వెంటనే ఇంటికి చేరుకున్న భాస్కర్‌రావు అపస్మారక స్థితిలో ఉన్న భార్యను చూసి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. పరిశీలించిన సిబ్బంది అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ తేజ్యానాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కామినేని దవాఖానలో అరుదైన శస్త్రచికిత్స

- ఆహారనాళంలో ఇరికిన ఎముకను తొలగించిన వైద్యులు

వృద్ధుడు శ్రీరాములుతో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రాధిక నిట్టల

మన్సూరాబాద్, మే 14: ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం, కక్కిరేని గ్రామానికి చెందిన శ్రీరాములు ఓ విందుకు హాజరైన సమయంలో మటన్ తింటుండగా ఎముక ఆహారనాళంలో ఇరుక్కుపోయింది. విషయం తెలువగా అతడు నెల రోజులుగా గుండెనొప్పితో బాధపడుతున్నాడు. పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకున్నప్పటికీ ఆహారనాళంలో ఎముక ఇరుక్కుపోయిన విషయాన్ని గుర్తించలేకపోయారు. ఇటీవల ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చేరారు. శ్రీరాములుకు ఎండోస్కోపీ చేసిన వైద్యులు ఆహారనాళంలో ఎముక ఇరుక్కుపోవడం వలన గుండె భాగంలో నొప్పి వస్తుందని తెలుసుకున్నారు. నెల రోజుల క్రితం నుంచి ఆహారనాళంలో ఎముక ఉండటం వలన సదరు ప్రాంతంలో ఇన్‌ఫెక్షన్ ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రాధిక నిట్టల నేతృత్వంలోని వైద్య బృందం ఎండోస్కోపిక్ ప్రొసీజర్ ద్వార ఎముక ముక్కను రోగి ఆహారనాళం నుంచి తొలగించారు. శ్రీరాములు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో ఆస్పత్రి నుంచి మంగళవారం డిశ్చార్జ్ చేశారు.

వైభవంగా అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు

సింహవాహనసేవలో స్వామివారు

ఆర్కేపురం, మే 14 : ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీసుదర్శనేష్ఠి, ద్వారతోరణం, మహాపూర్ణాహుతి, చూర్ణోత్సవం, చక్రతీర్థం, కల్పవృక్షవాహనసేవతోపాటు తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేశ్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి ఐత అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల్ల శ్రావణ్ కుమార్, మ్యాడం సుధాకర్, బంధం దామోదర్, బొగ్గరపు రవీంద్ర కుమార్, అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్‌రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతి, గౌరీశంకర్ ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి భారీ మెజార్టీ ఖాయం

ముషీరాబాద్, మే 14 : బీఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ యూత్ విభాగం నాయకుడు ముఠా జయసింహ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం విద్యానగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేపట్టడంలో బీఆర్ఎస్ శ్రేణులు కీలక పాత్ర పోషించారని, ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. శాసన సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను గెలిపించడానికి కృషి చేసిన విధంగానే ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు కోసం కృషి చేశారని అన్నారు. ఎమ్మెల్యేకు వచ్చిన మెజార్టీ కంటే ఎంపీ అభ్యర్థి ఎక్కువ సాధించబోతున్నారని తెలిపారు. పదేండ్లుగా కేసీఆర్ తెలంగాణను ఎలా అభివృద్ధి చేశారో.. ప్రజలు గుర్తు చేసుకుంటూ బీఆర్ఎస్ ఓట్లు వేశారని, వచ్చే నెల 4న గెలుపు సంబురాలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్ గుప్త, సురేందర్, రవి యాదవ్, నేత శ్రీనివాస్, మహ్మద్ ఖదీర్, శ్రీనివాస్, దీన్‌దయాల్ రెడ్డి , శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సైదాబాద్, మే 14 : దవాఖానలో చికిత్స పొందుతూ మరణించిన బంధువు కటుంబ సభ్యులను పరామర్శించి ద్విచక్రవాహనంపై వస్తూ ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జదుల్లా ఖాన్ చంచల్‌గూడ చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. చంచల్‌గూడ చౌరస్తా వద్ద కొనసాగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించిన రాడ్ ద్విచక్ర వాహనానికి అడ్డు తలగడంతో ఆయన అక్కడే కింద పడిపోయారు. దీంతో తలకు, భుజానికి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గాయపడ్డ అతడిని అనుచరులు, బంధువులు వెంటనే చికిత్స నిమిత్తం మలక్‌పేట యశోద దవాఖానకు తరలించారు. భుజానికి బలమైన గాయం కావటంతో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు చెప్పారని ఎంబీటీ ప్రధాన కార్యదర్శి ముస్తఫా మహమూద్ తెలిపారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో బీపీడీఏవీ విద్యార్థుల ప్రతిభ

సైదాబాద్, మే 14 : కంచన్‌బాగ్ మిధాని టౌన్‌షిప్‌లోని బీపీడీఏవీ పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ టెన్త్ పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి విజయకేతనం ఎగరవేశారు. 148 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ తెలిపారు. శ్రద్ధ కా మీనన్ 494 మార్కులు (98.8 శాతం), ఎంఎస్ ఎన్ఎస్‌వీ సాహిష్ణు (98.2 శాతం), ఆరూష్ మిట్టల్, టీవీకే లాస్య (97.2 శాతం), వెంకటచరణ్‌కుమార్ రెడ్డి (97శాతం) ఉత్తీర్ణత సాధించి టాపర్స్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నేరేడ్‌మెట్, మే 14: నేరేడ్‌మెట్ డివిజన్ జేజేనగర్‌లోని సెట్విన్‌లో ఉపాధి కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ ఇన్‌చార్జి. బి.చంద్రకళ పేర్కొన్నారు. మంగళవారం సెట్విన్ కేంద్రంలో ఇన్‌చార్జి బి.చంద్రకళ మాట్లాడుతూ సీసీ కెమెరా, ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, అకౌంటింగ్ ప్యాకేజీ, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, బ్యూటీషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు, గృహిణిలకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు.

నర్సరీల్లో కూరగాయల నారు

నర్సరీలో సిద్ధంగా ఉన్న నారు

కందుకూరు, మే 14 : కందుకూరు మండలం వాణిజ్య పంటలతో పాటు కూరగాయాల సాగుకు ప్రసిద్ధి. వానకాలంలో రైతులు సాధారణంగా పత్తి, కంది, మొక్క జొన్నల పంటల తర్వాత కూరగాయాల సాగుకు ప్రాధాన్యతను ఇస్తారు. కాగా మరి కొంత మంది రైతులైతే కేవలం కూరగాయాల పంటలనే సాగు చేస్తారు. టమటా, బెండ, వంగ, మిర్చి, క్యాబేజీ, వంటి తదితర కూరగాయాల పంటలను పండించడంలో మండలం ప్రసిద్ధిగాంచింది. గతంలో కూరగాయాలు పండించడానికి ముందు భూమిని సిద్ధం చేశాక నాణ్యమైన కూరగాయాల విత్తనాలను కొనుగోలు చేసి వారి వారి చేలల్లోనే నారు వేసి మొలత్తాక తగిన సమయం చూసి విత్తుకునే వారు. ప్రస్తుతం దాదాపు రైతులు ఈ పద్ధతికి స్వస్తి పలుకుతున్నారు. కారణం కొత్తగా కూరగాయాల నారు అందించే నర్సరీలు వెలిశాయి. దీంతో రైతులు తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. కాగా నగరానికి నియోజకవర్గం కూత వేటు దూరంలో ఉండటంతో చాలా మంది రైతులు కూరగాయాలను పండించి హైదరాబాదు మార్కెట్లకు తరలిస్తుంటారు.దీంతో కూరగాయాల సాగుకు చాలా మంది రైతులు మొగ్గు చూపడంతో కొందరు మండల కేంద్రంలో నర్సరీలను ఏర్పాటు చేసుకొని కూరగాయాల నార్లను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. నర్సరీల్లో మిరప, టమటా, క్యాబేజీ, కాలీఫ్లవర్, వంకాయ, తదితర కూరగాయాలతో పాటు రైతుల కోరిక మేరకు పూల మొక్కల నారును సైతం ఆర్డర్లపై అందిస్తున్నారు. ఏడాది పొడువునా రైతులకు కావాల్సిన నారును అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అందుబాటు ధరలకు విక్రయం

రైతులకు కావాల్సిన పలు రకాల కూరగాయాల నారు నర్సరీల్లో సిద్ధంగా ఉంది. కొందరు రైతులు విత్తనాలు పెంచి తీసుకువెళతారు. ఇంకొంత మంది రైతులు నేరుగా కొనుగోలు చేసి తీసుకెళ్తారు. ఒక్కో మొక్క రైతులకు అనుకూల మైన రేట్లకు విక్రయిస్తాం. పూల మొక్కల ధరలు కూరగాయాల మొక్కల ధరలు వేర్వేరుగా ఉంటాయి. తమకు ఉపాధితో పాటు రైతులకు అనుకూలంగా ఉంటుంది.

-గణేశ్, నర్సరీ నిర్వాహకులు, కందుకూరు

కార్యకర్తలకు అండగా ఉంటా

చర్లపల్లి, మే 14 : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఎల్లప్పుడు ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బం డారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. రామంతాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఉద్యమ నాయకుడు మధుసూదన్‌రెడ్డి కొంత కాలంగా అనారోగ్యానికి గురికావడంతో పార్టీ నాయకుడు గం ధం నాగేశ్వర్ రావు స మాచారం మేరకు ఉప్ప ల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మధుసూదన్ రెడ్డిని మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నా యకులు, కార్యకర్తలు ఎవరైన ఆరోగ్య సమస్యలు తలేతితే తన దృష్టికి తీసుకువస్తే మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకుడు మధుసూదన్‌రెడ్డికి వైద్య ఖర్చులు భరిస్తామని, ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

మైలార్‌దేవ్‌పల్లి, మే 14: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అవుతూ మరింత ముందుకు సాగాలని ఎస్ఓఎస్ సంస్థ సీఈవో సుమంత కర్ అన్నారు. మంగళవారం గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్ఐడీబీఐ) వారి సహకారంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈడీపీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఓఎస్ సంస్థ సీఈవో సుమంత కర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వట్టినాగులపల్లిలోని ఎస్ఓఎస్ సంస్థలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల నైపుణ్యాలు, వ్యాపారాలను అభివృద్ధి చేయడం ద్వార వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చవచ్చున్నారు. ఎస్ఐడీబీఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డిప్యూటీ మేనేజర్ రామకృష్ణలు మాట్లాడుతూ.. ఈ సంస్థ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అందిస్తున్న పథకాలను వివరించి చిన్న వ్యాపారులను ప్రోత్సహించడానికి ఎల్లవేళలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. లివింగ్ హుడ్ డైరెక్టర్ జిజిత్‌కుమార్ మాట్లాడుతూ.. చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న మహిళలకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం వివిధ సంస్థలు అందిస్తున్న ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలల గ్రామీణ సంచాలకులు కొట్రేష్ మాట్లాడుతూ .. ఎస్ఐడీబీఐ సంస్థ మహిళలకు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల్లో ఎస్ఓఎస్ సంస్థ ద్వారా లబ్ధిపొందుతున్న మహిళలు, ఎస్ఓఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు

జయంతి వేడుకల్లో పాల్గొన్న సగర సంఘం నాయకులు

చంపాపేట, మే14: సగర సామాజిక వర్గ ప్రజలు తమ కుల దైవంగా భావించే శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను మంగళవారం చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్ దుర్గానగర్ కాలనీలోని సగర (ఉప్పర)సంఘం కార్యాలయం ముందున్న శ్రీ భగీరథ మహర్షి విగ్రహం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా సగర సంఘం ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు బల్గూరి అమరేందర్ సాగర్ పాల్గొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యాల వెంకటేశ్ సాగర్, సభ్యులు కొలుగూరి భాస్కర్ సాగర్, బల్గూరి యాదయ్య సాగర్, ముత్యాల భాస్కర్ సాగర్, కొల్గురి విక్రమ్ సాగర్, సదుపట్ల గోవింద్ సాగర్ బల్గూరి నర్సింహ్మ సాగర్, రమేశ్ సాగర్, ముత్యాల కృష్ణ సాగర్, ముత్యాల మధుసాగర్, కొల్గూరి సురేందర్ సాగర్, ముత్యాల సురేశ్ సాగర్, బల్గూరి యాదగిరి సార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు మృతి

కాచిగూడ: వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు (60) శంషాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం – 2లో కొన్నిరోజులుగా అనారోగ్యంగా ఉంటూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై నీలిరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ఉందని, ఎత్తు 5.3 ఉన్నట్లు పేర్కొన్నారు.

నిబంధనలు పాటించని డయాగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు

చర్లపల్లి, మే 14: నిబంధనలు పాటించిన డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ స్వామి పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ పరిధిలో కీసర డివిజన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ నారాయణరావు, ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సౌందర్యలత, శ్రీనివాస్‌తో కలిసి ఉప్పల్‌లోని వాసవి డయాగ్నోస్టిక్, శోభసాయి డయాగ్నోస్టిక్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించి వైద్యులు సంతకం చేయనిని నివేదికలు, రిజిస్టార్లలను పరిశీలిం చి అల్ట్రాసౌండ్ మిషన్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డయాగ్నోస్టిక్ సెంటర్లపై తనిఖీలు నిర్వహించి గర్భనిర్ధారిత స్కానులకు సంబంధించి నివేదికలు లేనిచో తగు చర్యలు తీసుకుంటామని, డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ 1994ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.